క్లుప్తంగా

29న జాతీయ లోక్‌అదాలత్

పాలకొండ రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 29వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లోని కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అదాలత్ ఉపయోగపడుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. లోక్ అదాలత్, వాటి సేవలపై న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు.

ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పుష్పాలంకరణలో కొలువైన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ప్రత్యేక అలంకరణలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు పలుప్రాంతాల నుంచి వేకువజామునే స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు వివిధ రకాల పుష్ప, పత్రాలతో స్వామివారిని అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

సౌర విద్యుత్‌తో తాగునీటి సరఫరా



పూతిక వలసలో సౌర విద్యుత్ ఆధారిత మంచినీటి ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని పూతిక వలస గిరిజన గ్రామంలో సౌర విద్యుత్‌తో తాగునీటి సరఫరా జరుగుతోంది. గ్రామంలో 28 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్‌తో సంబంధం లేకుండా నిత్యం తాగునీరు అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల రక్తదానం

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం, సర్వేపాడు గిరిజన గ్రామానికి చెందిన ఎం. ప్రశాంత్ అనారోగ్య పరిస్థితుల్లో గురువారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరారు. బి పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించడంతో పేషెంట్ బంధువులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సహాయకుడు, ఎమ్మార్‌నగరం నివాసి నొత్త చిన్నారావు తెలియజేశారు. వెంటనే ఆయన స్పందించి మరోరక్తదాత వారణాసి వేదగిరితో వచ్చి ఇద్దరూ రక్తదానం చేశారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

సీతానగరం: ప్రభుత్వంలోని ఇతర శాఖల అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలందించడమే రెవెన్యూ శాఖ ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఏర్పడి 250 సంవత్సరాలైన సందర్భంగా వీఆర్వోలు, సర్వేయర్లతో ఉత్సవాలు నిర్వహించామన్నారు. వివిధ శాఖల అధికార సిబ్బందితో రెవెన్యూశాఖ సిబ్బంది సమన్వయం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలందించడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పి.చిట్టెమ్మ, సహాయగణాంకఅధికారి సతీష్, ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌ఏ రామారావు, వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగింపు

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ మండలంలోని తోణాం గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి విగ్రహానికి ముసుగు తొలగలేదని సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్ స్పందించారు. గురువారం వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించారు.

పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థ ఎంతో కీలకం



భామిని: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



జియ్యమ్మవలస: మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

- రెవెన్యూ డేలో తహసీల్దార్లు కె.జయప్రకాష్, పి.శ్రీనివాసరావు

వీరఘట్టం:

పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థ ఎంతో కీలకమని తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాల దగ్గర నుంచి రైతులకు భూ పట్టాలు, భూ సమస్యల పరిష్కారం, యువతకు ఉద్యోగాలు వచ్చినప్పుడు వెరిఫికేషన్ వంటి పనులతో పాటు, ఎన్నికల్లో చాలా కీలకంగా వ్యవహరించే ఏకైక శాఖ రెవెన్యూ శాఖ ఒక్కటేనన్నారు. మనిషిని పుట్టిన నాటి నుంచి చనిపోయే వరకు రెవెన్యూ వ్యవస్థతో సంబంధాలు ఉంటాయన్నారు. రెవెన్యూ ఉద్యోగులు కూడా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగులుగా పేరొందాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన వీఆర్వో ఉదయాన రామ్మూర్తినాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.లక్ష్మునాయుడు, మండల సర్వేయర్ ఎం.శ్రీనివాసరావు, వీఆర్వోలు పి.రఘునాయుడు, జి.సురేష్‌కుమార్, ఆర్.అప్పలనాయుడు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని సింగిడి గ్రామంలో రెవెన్యూ డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.శ్రీనివాసరావు రెవెన్యూ వ్యవస్థ పనితీరును వివరించారు. రెవెన్యూ వ్యవస్థకు ప్రజలకు మధ్య విడదీయలేని బంధం ఉందని, పుట్టిన నాటి నుంచి చనిపోయే వరకు ప్రతీ మనిషికి రెవెన్యూ శాఖతో పని ఉంటుందన్నారు. విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాల దగ్గర నుంచి రైతుల భూ పట్టాలు, భూ సమస్యల పరిష్కారం వంటివి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన వీఆర్వో గెల్లంకి దాసునాయుడును రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, మండల సర్వేయర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: రెవెన్యూ వ్యవస్థ సేవలు వివరిస్తున్న తహసీల్దార్ జయప్రకాష్

జియ్యమ్మవలస: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ డే కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామయ్య.. మొఘల్ చక్రవర్తుల కాలం నాటి నుంచి నేటివరకు రెవెన్యూ శాఖ విశిష్టత, చట్టాల అమలు తదితర అంశాలను వివరించారు. అలాగే రెవెన్యూ శాఖ పనితీరు, గొప్పతనం, ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి పకీరు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: రావుపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ జయ

బ్రిటీష్ కాలం నుంచి..

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ డే కార్యక్రమంలో తహసీల్దార్ కె.జయ పాల్గొని, రెవెన్యూ శాఖ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. బ్రిటిష్ కాలం నాటి నుంచే ఈ రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, ప్రస్తుతం ప్రభుత్వం కూడా రెవెన్యూ డే నిర్వహించుకోవాలని సూచించిందన్నారు. ఉద్యోగులంతా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగులుగా గుర్తింపు పొందాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులు ఎం.సత్యనారాయణ, టి.భీమునాయుడు, ఎ.సుబ్రహ్మణ్యం, జి.బాల, ఎ.గౌరునాయుడులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మహేశ్వరరావు, హెచ్‌డీటీ పి.లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార మార్గాలు అన్వేషించాలి

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు సమన్వయంతో వ్యవహరిస్తూ తమ సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఎన్ఎంయూ(నేషనల్ మజ్దూర్ యూనియన్) అధ్యక్షుడు ఎస్.టి.రావు అన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ సభ్యులతో గురువారం సమావేశమైన ఆయన.. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సంస్థ అనుసరిస్తున్న విధివిధానాల్లో లోపాలపై సమీక్షించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎప్పుడూ కృషి చేస్తుందని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం కొత్తగా యూనియన్‌లో చేరిన 60 మంది ఉద్యోగులకు సభ్యత్వం నమోదు చేసి, గుర్తింపు కార్డులు అందజేశారు.



కొత్తగా యూనియన్‌లో చేరిన వారికి సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న యూనియన్ నాయకులు

కార్యక్రమంలో ఎన్ఎంయూ పాలకొండ డిపో కార్యదర్శి వి.రాజేష్, నేతలు సుబ్బారావు, వైకుంఠరావు, సంగమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం



మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తితో పోలీసులు

భామిని: మండలంలోని బత్తిలి పోలీసులు తమలోని మానవత్వం చాటుకున్నారు. గ్రామంలో మతిస్థిమితం లేకుండా తిరుగాడుతున్న ఒక వ్యక్తిని ఇన్‌చార్జ్ ఎస్ఐ డి.అనిల్‌కుమార్, కానిస్టేబుల్ ఈశ్వరరావులు గురువారం పట్టుకుని, అతడికి సపర్యలు చేసి, ఆహారం పెట్టారు. అనంతరం అతడిని విశాఖపట్నంలోని మెంటల్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందేలా చేశారు. పోలీసులు వ్యవహరించిన తీరును గ్రామస్తులు అభినందిస్తున్నారు.

వేతనదారులకు 6,91,064 పనిదినాలు

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల్లోని వేతనదారులకు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 6,91,064 పనిదినాలు కల్పించినట్లు ఏపీవో ఎం.గౌరినాథ్ గురువారం తెలిపారు. పనుల్లో పాల్గొన్న వేతనదారులకు రూ.16.57 కోట్లు వేతనాలుగా చెల్లించడం జరిగిందన్నారు. అలాగే వివిధ రకాల పనులకు మెటీరియల్ కింద రూ.4.38 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పనులు కల్పించడం జరుగుతోందన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

గరుగుబిల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎస్.నాగభూషణరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పాఠశాలలో ప్రార్థనానంతరం యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగాసనాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించడం జరుగుతుందన్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి



తల్లిదండ్రుల సమావేశంలో పేరెంట్స్ విధులు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్

భామిని: పిల్లల చదువు, ప్రవర్తన, నడవడికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో పీఎంసీ చైర్మన్ సత్యనారాయణ సాంత్రో అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల విధులను వివరించారు. పిల్లలు ఎలా చదువుతున్నారు.. ఎలా ఉంటున్నారు.. ఎవరితో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారన్న అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు. చెడు అలవాట్లు, ప్రవర్తన గమనిస్తే వెంటనే అప్రమత్తమై మంచి బుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కలిప్తిస్తున్న సదుపాయాలు, ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాబూరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ పరిసరాల్లోని చెత్తాచెదారంతో పాటు కాలువల్లోని పూడికలు గురువారం తొలగించారు. అలాగే పాడైన తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులు చేపట్టి, యథావిధిగా తాగునీరు సరఫరా అయ్యేలా చేశారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల బారిన గ్రామస్తులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఎం.జగ్గరావు, పంచాయతీ కార్యదర్శి పి.మల్లేశ్వరరావు తెలిపారు. పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు క్లోరినేషన్ పనులు, దోమల నివారణ మందు పిచికారీ పనులు చేపడుతున్నామన్నారు.



కాలువలోని పూడికలు చెత్తబండిలోకి ఎక్కిస్తున్న దృశ్యం

మందులు అందుబాటులో ఉంచండి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లోని అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం కోరారు. మలేరియా జ్వరంతో బాధపడుతున్న కొంతమంది విద్యార్థులు ఇటీవల మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీకి వెళ్తే అక్కడ మందులు లేవని సిబ్బంది చెప్పడం చాలా బాధాకరమన్నారు. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఆస్పత్రుల్లో ఉండేలా చూడాలన్నారు. అలాగే పార్వతీపురం ఐటీడీఏలో రెగ్యులరైజ్ అయిన సీఆర్‌టీల్లో 16 మందిని నిబంధనలకు వ్యతిరేకంగా బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నియమించారన్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి, బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండ సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ సూచించారు. స్థానిక పాలకొండ-విశాఖపట్నం రోడ్డులో వాహనాల ఫిట్‌నెస్, వాటి రికార్డులు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పొల్యూషన్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను ఆయన గురువారం పరిశీలించారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.



వాహనదారులకు సూచనలిస్తున్న సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్

వైఎస్సార్ సీపీ అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యే

వీరఘట్టం: విజయవాడలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాలకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను ఆమె వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ అధినేత తమను ఆదేశించినట్లు తెలిపారు. మనం ఎవరికీ చెడు చేయలేదని, మంచి చేసి ఓడిపోయామని అన్నారన్నారు. మరి కొన్నిరోజుల్లోనే పార్టీ పూర్వవైభవం సాధిస్తుందని, అంతవరకు ఓపికతో వేచి చూడాలన్నారన్నారు.



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కళావతి

రాజీయే రాజమార్గం

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రాజీయే రాజమార్గమని, తెలిసీ తెలియక వివిధ కేసుల్లో ఇరుక్కున్న కక్షిదారులు రాజీమార్గం అనుసరించి, కేసుల నుంచి విముక్తి పొందాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టు భవనంలో ప్రీ లోక్ అదాలత్ కార్యక్రమం గురువారం నిర్వహించి, పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా అందే సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వీలైనంతవరకు గ్రామస్థాయిలో గ్రామపెద్దల సమక్షంలో కేసులు పరిష్కరించుకునేందుకు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, న్యాయవాదులు ఎస్.కృష్ణారావు, గోవిందరావు, జి.సత్యం, చందక జగదీష్‌కుమార్, ఎం.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

నేత్ర శస్త్రచికిత్సకు 78 మంది ఎంపిక

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. మొత్తం 121 మంది హాజరై, తమ కళ్లను పరీక్షించుకున్నారని, వారిలో 78 మందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, ఆపరేషన్లకు ఎంపిక చేశామని వైద్యురాలు అలేఖ్య తెలిపారు. అనంతరం ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం సహాయ సహకారాలతో శిబిరానికి హాజరైన వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు అలేఖ్య

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ ఆధ్వర్యంలో జైగురుదత్త హోమంను ఆలయ అర్చకులు శ్రీనివాసరావు చేశారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. బాబా దర్శనానికి మండల కేంద్రంలోని భక్తులతో పాటు మండల పరిసర గ్రామాలైన పెద్దూరు, హిక్కింవలస, ఉద్దవోలు, రావుపల్లి, బి.వి.పురం, కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు.



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

చెత్త తొలగించరూ..?

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని పెదకాపు వీధి-గారమ్మ కాలనీల మధ్య ఉన్న సాగునీటి కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. స్థానికులే గృహవ్యర్థాలు అందులో పడేయడంతో అవి కుళ్లి, దుర్గంధం వెదజల్లుతోంది. అంతేకాకుండా అక్కడే వేలాది మంది ప్రజలు నివశిస్తుండడంతో పాటు అక్కడి ప్రభుత్వ పాఠశాలలకు వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజూ వస్తుంటారు. వారంతా ఈ కాలువ వద్దకు వచ్చేసరికి ముక్కులు మూసుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి. ఇక్కడి పరిస్థితి ఇలానే ఉంటే రానున్న వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే పరిస్థితులు చాలా ఎక్కువగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. కాలువలోని మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం కారణంగా దోమలు ఎక్కువగా పెరిగి, మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, పారిశుద్ధ్య పనులు చేయించి, కాలువను బాగు చేయాలని కోరుతున్నారు.



గారమ్మ కాలనీ వద్ద మురుగునీటితో నిండిన సాగునీటి కాలువ

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ ఈవో నారాయుడు

సీతంపేట: మండలంలోని మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ డిప్యూటీ ఈవో పి.నారాయుడు చేతులమీదుగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు గురువారం పంపిణీ చేశారు. మొదటి విడతలో పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్నామని, రెండో విడతలో యూనిఫాం, షూస్ వంటివి ఇవ్వడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, పాఠశాలలో చేరిన వారంతా పాఠశాల విద్య పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ వీరేశు, తదితరులు పాల్గొన్నారు.



భామిని: స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

భామిని: మండలంలోని నేరడి-బి ఎంపీయూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు గురువారం పంపిణీ చేశారు. ప్రస్తుతానికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగులు మాత్రమే అందజేసినట్లు విద్యార్థులు తెలిపారు.

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

సీతంపేట: ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సవర భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలని వారంతా కోరుతున్నారు. ఇదే విషయమై వారు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొరను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఐటీడీఏ పరిధిలో 152 మంది పనిచేస్తుండగా, ఎప్పటిలాగే ఈ విద్యాసంవత్సరానికి కూడా పనిచేసేలా ఉత్తర్వులు జారీ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని డీడీ హామీ ఇచ్చారు.

జాబ్‌మేళా రేపు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు గురువారం తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన సంస్థ సహకారంతో ఉదయం 10 గంటలకు ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు కలిగిన పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ అర్హత కలిగిన యువతీ,యువకులు ముందుగా (http: empoyment.ap. gov.in) వెబ్‌సైట్‌ను సంప్రదించి, వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. మరింత సమాచారానికి ఫోన్ నంబర్ 99088 27160ను సంప్రదించాలని కోరారు.